నమస్తే తెలంగాణ

# ఖమ్మం

8 | ఖమ్మం, సోమవారం 13 మే 2024 | KHAMMAM



- ఖమ్మం పార్లమెంట్ స్థానంలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభం
- 'ఖమ్మం'లో సాయంత్రం 6 గంటల వరకు, 'భద్రాద్రి'లో సాయంత్రం 4 వరకే పోలింగ్
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 16,31,039 మంది ఓటర్లు
- జిల్లాలో 1,896 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ
- పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత.. 144 సెక్షన్ అమలు



ఖమ్మం రూరల్‌లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సిబ్బందికి సామగ్రిని కేటాయిస్తున్న ఎన్నికల అధికారులు

# నేడే పోలింగ్

ఖమ్మం, మే 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సార్వత్రిక ఎన్నికల నాలుగో విడతలో భాగంగా ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గంలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి కేంద్రం ఎన్నికల సంఘం పోలింగ్‌ను ప్రారంభించనుంది. ఈసీ మార్గదర్శకాల మేరకు ఉదయం 6 గంటల నుంచే ఎన్నికల అధికారులు ప్రక్రియను ప్రారంభిస్తారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణ కోసం ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ పర్యవేక్షణలో ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. సామగ్రి పంపిణీ కేంద్రాల నుంచి పోలింగ్ సిబ్బంది తమ సామగ్రిని తీసుకొని ప్రత్యేక బస్సుల్లో ఆదివారం సాయంత్రమే తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఖమ్మం పార్లమెంటు స్థానం పరిధిలో ఖమ్మం జిల్లాలో ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లు, భద్రాద్రి జిల్లాలో రెండు సెగ్మెంట్లు ఉండగా వాటన్నింటినీలో సోమవారం పోలింగ్ జరుగనుంది. ఖమ్మం జిల్లాలో సాయంత్రం 6 గంటల వరకూ, మావోయిస్టు ప్రభావిత భద్రాద్రి జిల్లాలో సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగనుంది. గత శాసనసభ ఎన్నికలకంటే ఈ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెరగడంతో అందుకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను పెంచి వసతులను మెరుగు పరిచారు. ఖమ్మం పార్లమెంట్ బరిలో 35 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా.. ఇందులో నలుగురు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ నుంచి బరిలో ఉన్నారు. మిగతా 31 మంది వివిధ రిజిస్టర్ పార్టీల అభ్యర్థులతోపాటు ఏ పార్టీలతోనూ సంబంధం లేని స్వతంత్ర అభ్యర్థులు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 1084 లోకేషన్లలో 1896 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో విధులు నిర్వహించేందుకు 7584 మంది ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఈసీ మార్గదర్శకాల ప్రకారం 20 శాతం అదనపు సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. 103 లోకేషన్లలో 230 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. సమస్యాత్మక కేంద్రాల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వంద శాతం పోలింగ్ కేంద్రాల లోపల సీసీ కెమెరాలు అమర్చారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసిన 7034 బ్యాలెట్ యూనిట్లు, 2323 కంట్రోల్ యూనిట్లు, 2634 వీవీప్యాట్లు స్ట్రాంగ్ రూముల నుంచి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నాయి. నియోజకవర్గంలో మొత్తం 16,31,039 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 7,87,160 మంది పురుషులు, 8,43,749 మంది మహిళలు, 130 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. వీరంతో సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.





మధిరలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న ఎన్నికల సిబ్బంది



పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

## స్లిప్పు లేకున్నా ఓటు వేయొచ్చు: కలెక్టర్

ఓటరు స్లిప్పులు అందకపోయినప్పటికీ ఈసీ సూచించిన ఐదైనా గుర్తింపు కార్డు చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని ఆర్‌వో, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. ఈసీ మార్గదర్శకాలను ఎన్నికల సిబ్బంది తూచా తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించాలని కోరారు.

## నిరంతరం అప్రమత్తంగా ఉండాలి: సీపీ

సోమవారం సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ సునీల్‌దత్ సూచించారు. జిల్లాలో పోలీంగ్ విధులకు 2391 మంది రాష్ట్ర, కేంద్ర బలగాల పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రత్యేకంగా గుర్తించిన 86 పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఈవీఎంలు తిరిగి స్ట్రాంగ్ రూములకు చేరే వరకు అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని సీపీ ఆదేశించారు

## భద్రాద్రి జిల్లాలో 1,105 కేంద్రాల్లో..



భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలం రాంనగర్‌లో పోలింగ్ బూత్‌లో ఈవీఎంను సిద్ధం చేస్తున్న ఎన్నికల అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం, మే 12 (నమస్తే తెలంగాణ): భద్రాద్రి జిల్లాలో సోమవారం జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు కలెక్టర్ ప్రియాంక అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 1,105 పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ఇప్పటికే చేరుకున్నారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో మెటీరియల్ పంపిణీ కేంద్రాల నుంచి పోలీస్ బందోబస్తు నడుమ సిబ్బంది, ఈవీఎంలను తరలించారు. కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల పరిధి ఖమ్మం పార్లమెంట్ పరిధిలోకి రావడంతో సిబ్బంది అంతా ఖమ్మం పరిధిలో విధులు నిర్వహిస్తున్నారు. భద్రాచలం, ఇల్లెందు, పినపాక పరిధిలో ఉద్యోగులు మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఐదు గంటలకు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. సరిగ్గా 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభిస్తారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించనున్నారు. రెండు గంటలకొకసారి పోలింగ్ శాతాన్ని తెలియజేయడం కోసం మీడియా కేంద్రాన్ని కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంచారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం అవడం వల్ల పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. మావోయిస్టుల ప్రభావిత జిల్లా కావడంతో సాయంత్రం 4 గంటలకే వరకూ పోలింగ్ ఉంటుందని ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. అదీగాక ఓటర్లను తప్ప ఇతరులనెవరినీ పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు.

# పోలింగ్‌కు సర్వం సిద్ధం

- పార్లమెంట్ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న అధికారులు, సిబ్బంది
- 'గూడెం', 'పేట'లో సామగ్రి పంపిణీ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



కొత్తగూడెంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/అశ్వారావుపేట, మే 12: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ మేరకు ఎన్నికల విధులకు నియమితులైన సిబ్బంది తమ సామగ్రితో ఆదివారం సాయంత్రమే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అయితే, కొత్తగూడెం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆదివారం సందర్శించారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని 253 పోలింగ్ కేంద్రాలకు గాను ఇక్కడి రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీ తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ.. నియోజకవర్గంలోని 253 పోలింగ్ కేంద్రాలకు గాను 1,212 మంది ఎన్నికల సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. ఇందులో పీవోలు 303 మంది, ఏపీవోలు 303 మంది, ఓపీవోలు 606 మందిని ఉన్నట్లు చెప్పారు. సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లేందుకు 49 బస్సులను, అదనంగా మరో మూడు బస్సులను సిద్ధంచినట్లు వివరించారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచే ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ చేపట్టామన్నారు. ఆర్డీవో మధు, తహసీల్దార్ పుల్లయ్య, చుంచుపల్లి డీటీ, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

### సాయంత్రం 4 వరకూ పోలింగ్..

జిల్లాలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు చెప్పారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల మెటీరియల్ అందించామని, వీరంతా పోలీస్ సెక్యూరిటీతో పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారని అన్నారు. వెబ్ కాస్టింగ్ పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ జరుగుతుందన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘాను మరింత పటిష్టం చేశామని, ఈసీ ఆదేశానుసారం సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ వేణుగోపాల్, తహసీల్దార్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

- ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు
- ఓటర్లు స్వేచ్ఛగా ఓటేయాలి
- ఖమ్మం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్



వైరాలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలీసులకు సూచనలు చేస్తున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్

మామిళ్లగూడెం, మే 12: స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టామని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్లను ప్రలోభాలు, ఒత్తిడులు, భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో 53, ఖమ్మం జిల్లావ్యాప్తంగా 40 ఫ్లయింగ్‌స్క్వాడ్ టీంలు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ పటిష్ట నిఘా చేపడుతున్నాయని పేర్కొన్నారు. వీటికి తోడు 21 ఎస్ఎస్‌టీ టీంలు, 37 ఎంసీసీ టీం, 203 మంది సెక్టార్ అధికారులు క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల వ్యయ నోడల్ అధికారులు, వ్యయ పరిశీలకులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. జిల్లాలో నగదు జప్తు విషయమై పలు కేసులు నమోదు చేశామన్నారు. కూసుమంచి మండలం దేవునితండా వద్ద ఓ పార్టీ వారు ఓటర్లకు పంపిణీ చేయడానికి తీసుకెళ్తున్న రూ.99.94 లక్షలను నిఘా అధికారులు జప్తు చేసి కేసు నమోదు చేశారన్నారు. మధిర మండలం నారాయణపురం వద్ద ఇంకో పార్టీ వారు రూ.1.70 లక్షలు పంపిణీకి తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. మధిరలో మరో పార్టీ వారు ఓటర్లకు నగదు పంచుతుండగా పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. మధిరలో ఇంకో పార్టీకి చెందిన వారు ఓటర్లకు పంచడానికి తరలిస్తున్న రూ.4,29,500ను, ఖమ్మం వన్‌టౌన్‌లో ఓటర్లకు పంచడానికి తీసుకెళ్తున్న రూ.45,650ను, కారేపల్లిలో ఓటర్లకు పంచడానికి మరో పార్టీ వారు తీసుకెళ్తున్న రూ.3,46,500లను పట్టుకొని జప్తు చేసి కేసులు నమోదు చేసినట్లు వివరించారు. రాజకీయ నేతలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే సంబంధిత అభ్యర్థులపై కేసు నమోదు చేస్తామని, నగదు, మెటీరియల్, వాహనాలు జప్తు చేస్తామని, కఠిన చర్యలు చేపడతామని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛతో, నైతికతతో ఓటు వేయాలని కోరారు.

# మహిళలు, దివ్యాంగులకు ఆదర్శ పోలింగ్ కేంద్రాలు

- పోలింగ్ శాతం పెంచేందుకు ఈసీ కార్యాచరణ
- స్వాగత తోరణాలు.. ప్రత్యేక అలంకరణలు



కూసుమంచిలోని మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రం



బోనకల్లు జానకీపురంలోని దివ్యాంగుల ఆదర్శ పోలింగ్ కేంద్రం

'ఓటర్ల చైతన్యం - ఎన్నికల్లో భాగస్వామ్యం' కార్యక్రమంలో భాగంగా పోలింగ్ శాతాన్ని గణనీయంగా పెంచేందుకు, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా మహిళలకు, దివ్యాంగులకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటిలో వారికి అన్ని సౌకర్యాలూ కల్పించింది. పోలింగ్ కేంద్రాలను కూడా ప్రత్యేకంగా అలంకరించింది. పోలింగ్ స్టేషన్ల ముందు భాగాన అరటి మొక్కలతో స్వాగత తోరణాలను ఏర్పాటుచేసింది. శామియానాలు, క్లాత్ కర్టెన్లు, పచ్చని తివాచీలతో సుందరంగా తీర్చిదిద్దింది. పోలింగ్ కేంద్రాల లోపలి భాగాలను కూడా ఆహ్లాదంగా రూపుదిద్దింది. ఇవన్నీ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. –నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మే 12

# పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

## ఖమ్మం జిల్లాకు ఆరు కంపెనీల కేంద్ర బలగాలు: సీపీ సునీల్‌దత్



సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మం రూరల్, మే 12: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు గాను అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఖమ్మం సీపీ సునీల్‌దత్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఖమ్మం రూరల్ మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఎన్నికల బందోబస్తుకు హాజరవుతున్న పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సెక్షన్ 144 అమల్లో ఉన్నందున భద్రతా పరమైన అన్ని చర్యలూ పకడ్బందీగా ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఈవీఎంలు తిరిగి స్ట్రాంగ్‌రూములకు వచ్చే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. 230 క్రిటికల్ పోలీంగ్ స్టేషన్లలో కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా పోలీస్ పెట్రోలింగ్ బృందాలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే నేర చరితులను ఇప్పటికే బైండోవర్ చేశామన్నారు. ఇప్పటికే జిల్లాకు చేరుకున్న ఆరు కంపెనీల కేంద్ర బలగాల సిబ్బందితోపాటు 2,391 పోలీస్‌లు, టీఎస్‌పీఎస్ బెటాలియన్ సహా వివిధ విభాగాల పోలీస్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నట్లు వివరించారు. మద్యం, నగదు అక్రమ రవాణా అయ్యే అవకాశం ఉన్నందున పోలింగ్‌కు రెండురోజుల ముందు నుంచే కమిషనరేట్ పరిదిలో పూర్తి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ నేపథ్యంలోనే కూసుమంచి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్నోవా వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రూ.99.94 లక్షల గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆ నగదును ఆదాయపు పన్ను శాఖ అధికారులకు సమాచారం అందించామన్నారు. ట్రైనీ ఐపీఎస్ మౌనిక, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, సీఐ రాజిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా పోలింగ్ జరగాలి

### భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం క్రైం, మే 12 : శాంతియుత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వహించాలని జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు అన్నారు. కొత్తగూడెం రామచంద్ర డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రూట్ మొబైల్స్, పోలింగ్ కేంద్రాల బందోబస్తు అధికారులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయయ సంఘటనలకు తావులేకుండా ప్రతీ అధికారి, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎవరికి కేటాయించిన విధులను వారు బాధ్యతగా నిర్వర్తించి పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు కృషి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి విక్రాంత్ సింగ్, కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు